క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కోటవురట్ల: కై లాసపట్నం, కె.వెంకటాపురం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ డీఈ అప్పారావు తెలిపారు. కై లాసపట్నం, కె.వెంకటాపురం గ్రామాల్లోని 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో లైన్ నిర్వహణలో భాగంగా చెట్ల నరికివేత ప్రక్రియ చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. తంగేడు, సుంకపూరు, జల్లూరు, బి.కె.పల్లి, కె.వెంకటాపురం, కొడవటిపూడి, తడపర్తి, విశ్వనాథపురం, ఆర్.కొత్తూరు, కె.కొత్తూరు గ్రామాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మునగపాక: మునగపాక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులతో పాటు చెట్ల తొలగింపులో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. మునగపాక, తిమ్మరాజుపేట, కొత్త నాగవరం, పాత నాగవరం, వాడ్రాపల్లి, గొల్లలపాలెం తదితర ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎస్.రాయవరం: కొరుప్రోలు, ఎస్.రాయవరం సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, కర్రివానిపాలెం, జీవీపాలెం, సర్వసిద్ధి, బసవపాడు, సైతారుపేట, వాకపాడు, గుర్రాజుపేట, గుడివాడ, ఎల్‌పీఆర్‌పేట, పెద ఉప్పలం గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ పథకం



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక: అన్నదాత సుఖీభవ పథకం అర్హులైన రైతులందరికీ వర్తించేలా చూడాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, వీఏఏలతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకానికి సంబంధించి ప్రతి రైతుకు ఆధార్ అనుసంధానం ఉండేలా చూడాలన్నారు. ఎన్‌సీపీఐ చేయించాలన్నారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, డీటీ మురళీధర్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మునగపాక పోలీస్ స్టేషన్ సందర్శన

మునగపాక: మునగపాక పోలీసు స్టేషన్‌ను గురువారం సాయంత్రం యలమంచిలి సీఐ ధనుంజయరావు సందర్శించారు. స్టేషన్ తనిఖీలో భాగంగా ఆయన పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగద సత్సంగ ధ్యాన మండలి ప్రారంభం రేపు


పాయకరావుపేట: యోగా సొసైటీ ఆఫ్ ఇండియా(రాంచీ) ఆధ్వర్యంలో తునిలో నిర్మించిన యోగద సత్సంగ ధ్యాన మండలిని శనివారం యోగద సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు స్వామి శ్రీస్మరణానంద గిరి ప్రారంభించనున్నారని తుని ధ్యాన మందిరం అధ్యక్షుడు ఏఎస్ఆర్ ధర్మ తెలిపారు. సాయంత్రం 4.30 నుంచి 7 గంటల వరకు క్రియా యోగ సాధన ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని ఆయన తెలిపారు.

రెండో రోజూ క్వారీ బాధితుల నిరాహార దీక్షలు

నర్సీపట్నం : మాకవరపాలెం మండలం, జి.కోడూరు సర్వే నెంబరు 332లో కొనసాగుతున్న నల్లరాయి క్వారీని రద్దు చేయాలంటూ దళిత రైతులు, ప్రజాసంఘాలు ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన నిరాహారదీక్షలు గురువారం నాటికి రెండో రోజుకు చేరాయి. వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు మట్ల చంటిబాబు, ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బొట్టా నాగరాజు, ఓబీసీ జిల్లా నాయకులు బొంతు రమణ, సామాజిక కార్యకర్త కె.శివనారాయణరాజు, కె.వి.పి.ఎస్ నాయకులు చిరంజీవి మాట్లాడుతూ క్వారీ నిర్వహణ వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నందున తక్షణమే అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. క్వారీ అనుమతులు మంజూరులో పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించారన్నారు. భవిష్యత్తులో కూడా క్వారీ నిర్వహణకు అనుమతులు ఇవ్వబోమని హామీ ఇవ్వాలన్నారు. అనుమతులు రద్దు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. దీక్షల్లో బాధిత సాగుదారుల సంఘం నాయకులు అప్పారావు, లోవరాజు, పెంటయ్య, గణేష్, సతీష్, రమణ పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం.!

- పల్లెల్లో మురుగు కంపు
- కాలువల్లో నిలిచిపోతున్న మురుగునీరు
- ప్రచారానికే పరిమితమవుతున్న 'స్వచ్ఛత హీ సేవ'



ఉమ్మలాడలో సాగునీటి కాలువలో మురుగునీరు

మునగపాక: ఒకవైపు స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాలు దీగా నిర్వహిస్తున్నామంటూ ఊకదంపుడు ప్రచారాలు.. మరో వైపు గ్రామాలు సస్యశ్యామలం చేయడమే లక్ష్యం అంటూ నాయకులు, అధికారులు ప్రచార ఆర్భాటాలు.. అయితే క్షేత్రస్థాయిలో ఎక్కడా చూసిన గ్రామాల్లో మురుగు కంపు కొడుతోంది. పల్లెల్లో మురుగు, చెత్త ఎక్కడికక్కడ దర్శనమిస్తోంది. పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలంటూ మండల స్థాయి అధికారులు పదేపదే చెబుతున్నా క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు.

అధ్వానంగా పారిశుధ్యం నిర్వహణ

గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్యం మెరుగుపరచాల్సిన అధికారులు కనీసం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాలు సస్యశ్యామలంగా ఉండాలంటే చెత్తా చెదారం లేకుండా చూడాలి. అయితే గ్రామస్థాయి అధికారులు ఎందుకో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఉన్నతాధికారుల పర్యటన ఉన్నప్పుడు మాత్రమే తూతూమంత్రంగా పారిశుధ్యం మెరుగు పరుస్తున్నారే తప్ప చిత్తశుద్ధి చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మురుగుకూపంగా మునగపాక మెయిన్ రోడ్డు కాలువ



మునగపాక మెయిన్‌రోడ్డులోని మురుగుకాలువలో నిలిచిన మురుగునీరు

మండల కేంద్రమైన మునగపాక మెయిన్‌రోడ్డు పక్కనే ఉన్న కాలువ అధ్వానంగా తయారైంది. ఈ కాలువలో మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వర్షాలు కురిసే సమయంలో కాలువ నిండిపోయి ప్రధాన రహదారిపైకి మురుగునీరు వచ్చేస్తోంది. దీంతో ఈ మార్గం గుండా రాకపోకలు సాగించేవారు నానా అవస్థలు పడుతున్నారు. ఈ కాలువ నుంచి నీరు పోయేందుకు గతంలో ఉన్న కాలువ ఆక్రమణకు గురికావడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. రోజుల తరబడి కాలువలో మురుగునీరు ఉండిపోవడంతో రోగాలు సంభవించే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మలాడలో అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ



చెత్తతో నిండిన కాలువ

మండలంలోని ఉమ్మలాడలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. గ్రామానికి చెందిన కాలువలో నీరు పోయే పరిస్థితులు కనిపించడం లేదు. ఇళ్ల ముందు కాలువల్లో మురుగునీరు ఉండిపోవడంతో దుర్వాసనతో ప్రజలు సతమతమవుతున్నారు. ఎప్పటికప్పుడు కాలువలను శుభ్రం చేయించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామంలోని సాగునీటి కాలువలోకి మురుగునీరు వదిలేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నారాయుడుపాలెంలో వేధిస్తున్న డ్రైనేజీ సమస్య



నారాయుడుపాలెంలో ప్రధాన సెంటర్ వద్ద మురుగు

నారాయుడుపాలెం గ్రామంలో కూడా డ్రైనేజీ సమస్య వేధిస్తోంది. గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల ముందు నీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన కూడలిలో మురుగునీరు పోయే అవకాశం లేకుండా పోయింది. దోమలకు నిలయంగా మారింది. వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందంటూ గ్రామ ప్రజలు వాపోతున్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి



గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ప్రతి శుక్రవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నాం. అంటువ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలంటూ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిస్తున్నాం. సీజన్‌లో రోగాలు సంభవించకుండా చర్యలు తీసుకుంటాం. కాలువల్లో మురుగునీరు పోయేలా చర్యలు తీసుకోవాలంటూ కార్యదర్శులకు సూచిస్తాం. అందరి భాగస్వామ్యంతోనే పారిశుధ్యం నిర్వహణ సాధ్యం.

– ఎం.ఉషారాణి, మునగపాక ఎంపీడీవో

వరాహ నదికి వరద నీరు



జల్లూరు వద్ద వరాహనది

కోటవురట్ల: వరాహ నదికి మళ్లీ జలకళ వస్తోంది. చాలా కాలంగా ఎండిపోయి బీడుభూమిని తలపించిన వరాహ నదిలో ప్రస్తుతం వరదనీరు చేరుతోంది. ఎగువ ఏజెన్సీలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వరాహ నదిలోకి కొంచెం కొంచెంగా ప్రవాహం వస్తోంది. పాతరోడ్డు సమీపంలో వరాహ నదిలోకి సర్పానది కలియడంతో ఇక్కడ నీటి ప్రవాహం పెరుగుతోంది. గొట్టివాడ, పందూరు ప్రాంతాలలో ఉధృతి పెరిగే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నదిలోకి దిగొద్దని అధికారులు సూచిస్తున్నారు. వరాహ నదికి జలకళ రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగుకు దోహదపడుతుందని ఆశ పడుతున్నారు.

శ్రీదేవీతల్లి ఆలయ నిర్మాణానికి విరాళం

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో నిర్మిస్తున్న శ్రీదేవీతల్లి అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. వచ్చే నెలలో ప్రారంభోత్సవానికి దేవాలయం సిద్ధమవుతోంది. దీనిలో భాగంగా అనకాపల్లి గవరపాలెం ప్రాంతానికి చెందిన భవ్యశ్రీ డెవలపర్స్ అధినేత కాండ్రేగుల నాయుడు తన వంతు సాయంగా గురువారం ఆలయ నిర్మాణానికి రూ.1.16 లక్షల నగదును ఆలయ చైర్మన్ పల్లె అప్పలనాయుడుకు అందజేశారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి



మాట్లాడుతున్న విశ్రాంత ఉపాధ్యాయుడు డాక్టర్ రాజశేఖర్

మునగపాక: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని గురుకుల పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయుడు డాక్టర్ రాజశేఖర్ కోరారు. మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి విశ్వహిందూ పరిషత్ మండల శాఖ అధ్యక్షుడు శరగడం పరదేశినాయుడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత పారాయణం చేసుకోవాలన్నారు. భక్తి భావాలను పెంచుకోవాలన్నారు. హిందూ ధర్మాన్ని పాటించేలా అవగాహన చేసుకోవాలన్నారు. భగవన్నామ స్మరణతో మంచి జరుగుతుందన్నారు. అనకాపల్లి సర్వశిక్ష అభియాన్ ప్రతినిధి కర్రి జోగినాయుడు మాట్లాడుతూ అందరికీ దైవభక్తి అవసరమన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, విశ్రాంత ఉపాధ్యాయులు మొల్లేటి సత్యనారాయణ, పెంటకోట జగన్నాథరావునాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లార్వా వ్యాపించకుండా చర్యలు



గొడిచర్లలో క్లోరినేషన్ పనులు పరిశీలిస్తున్న అధికారులు

నక్కపల్లి: మండలంలో పలు గ్రామాల్లో ఎంపీడీవో సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు గురువారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో లార్వా వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. కాలువల్లో పూడిక తీత పనులు, వీధుల్లో చెత్తను తొలగించడం వంటి పనులు చేపట్టారు. గొడిచర్ల, దేవవరం, ఉద్దండపురం, రమణయ్యపేట, తదితర గ్రామాల్లో క్లాప్ మిత్రల ద్వారా పారిశుధ్య పనులు నిర్వహించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని గ్రామాల్లో లార్వా విస్తృతంగా వ్యాప్తి చెందుతుందని, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించి క్లోరినేషన్ కార్యక్రమాలు చేపడుతున్నామని ఎంపీడీవో తెలిపారు. గొడిచర్ల బీసీ వసతి గృహాన్ని అధికారులు సందర్శించారు. అక్కడ జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని వార్డెన్‌కు సూచించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



యండపల్లిలో పారిశుధ్యంపై సూచనలు ఇస్తున్న అధికారులు

కోటవురట్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని ఐవీఆర్ఎస్ గ్రామాలు యండపల్లి, జల్లూరు, తంగేడులో పారిశుధ్య డ్రైవ్ గురువారం నిర్వహించారు. ఎంపీడీవో చంద్రశేఖర్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో పాటు ఇంటింటికి వెళ్లి పారిశుధ్యాన్ని పరిశీలించారు. పలు ఇళ్లల్లో నీరు నిలిచిపోయి నాచుపట్టి ఉండడం, చెత్త పేరుకుపోవడం గుర్తించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుతం వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని, పరిశుభ్రతతోనే వ్యాధులను నిరోధించవచ్చని చెప్పారు. ఇంటి పరిసరాలలో కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ సామాన్లు పోగు చేయడం వల్ల నీరు నిల్వ ఉండి దోమలు పుట్టుకొస్తాయన్నారు. కాచి వడకట్టిన నీటిని తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, కార్యదర్శి రవికిరణ్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అన్నింటా విఫలం: కరణం ధర్మశ్రీ

- నేడు వైఎస్సార్‌సీపీ యలమంచిలి మండల సమావేశం



మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

యలమంచిలి రూరల్: కూటమి ప్రభుత్వం ఇటు సంక్షేమం, అటు అభివృద్ధి చేయడంతో పాటు శాంతి భద్రతలు కాపాడడంలో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త, ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయిందని, ఇప్పటి వరకు ఎన్నికల హామీలు అమలు చేయకుండా పక్షపాత ధోరణి, రాజకీయ కక్షసాధింపు చర్యలకే ప్రాధాన్యతనిస్తున్నారే తప్ప ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడంలేదన్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండా సర్వేలతో కాలయాపన చేస్తున్నందుకు నిరసనగా శుక్రవారం ఉదయం 9.30 గంటలకు యలమంచిలి గురప్ప కల్యాణ మండపంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ధర్మశ్రీ తెలిపారు. యలమంచిలి మండల స్థాయిలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మండలంలో ప్రతి గ్రామ పంచాయతీ నుంచి, యలమంచిలి పట్టణంలో ప్రతి వార్డు నుంచి 10 మంది వైఎస్సార్‌సీపీ ప్రధాన నాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేలా, వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్న కూటమి ప్రభుత్వ తీరు ఎండగట్టడానికి ప్రజల మద్దతు కోరుతామన్నారు. ఈ సమావేశాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

అర్బన్ మార్కెట్‌తో మహిళలకు ఉపాధి



అర్బన్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి

యలమంచిలి రూరల్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అర్బన్ మార్కెట్లతో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి లభిస్తోందని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అభిప్రాయపడ్డారు. గురువారం పట్టణంలోని తులసీనగర్‌లో అర్బన్ మార్కెట్‌ను ఆమె ప్రారంభించారు. మహిళలు తయారు చేసిన పలు రకాల వస్తువులను ఆమె పరిశీలించారు. తరచూ ఇలాంటి మార్కెట్ల నిర్వహణతో మహిళలు ఆర్థికంగా ఎదుగుతారన్నారు. జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రతి నెలా అర్బన్ మార్కెట్‌లను నిర్వహిస్తున్నామని మెప్మా సీఎంఎం పద్మావతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడారి రమణబాబు, ఆడారి ఆదిమూర్తి, మెప్మా రిసోర్స్ పర్సన్లు సుధ, సబల, సత్య, కృష్ణవేణి పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్ భీమిశెట్టి, తదితరులు

మునగపాక: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు అన్నారు. తిమ్మరాజుపేట సచివాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఉద్యోగులను గురువారం సాయంత్రం పంచాయతీ పాలకవర్గం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు, పదవీ విరమణలు సహజమన్నారు. పనిచేసే చోట ప్రజలకు మెరుగైన సేవలందించేలా పాటుపడాలన్నారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, మాజీ ఎంపీపీ ఆడారి మంజు, పెద్దలు భీమరశెట్టి శ్రీనివాసరావు, బీవీ రమణ, నరసింగరావు, సూరిశెట్టి రాము, తదితరులు పాల్గొన్నారు

'రామాలయం భూమి ఆక్రమణ తగదు'



రామాలయం భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ మహేశ్వరరావు

పాయకరావుపేట: మండలంలోని శ్రీరాంపురం గ్రామానికి చెందిన సర్వే నంబరు 75/2లోని 25 సెంట్లు భూమి రికార్డులు ప్రకారం గ్రామంలోని రామాలయానికి చెందినదని తహసీల్దార్ ఎస్.ఎ.మహేశ్వరరావు తెలిపారు. రామాలయానికి చెందిన 25 సెంట్లను గ్రామానికి చెందిన కొందరు చదును చేస్తుండడంతో తహసీల్దార్‌కు ఫిర్యాదు అందింది. ఈ మేరకు ఆయన గ్రామానికి వెళ్లి ఈ భూమిలో ఏవిధమైన పనులు చేపట్టవద్దని, రికార్డుల ప్రకారం ఈ భూమి రామాలయానిదని చెప్పారు. ఈ భూమికి సంబంధించిన రికార్డులు ఉంటే హక్కుదారులు తమ వద్దకు తీసుకురావాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రామాలయం ధర్మకర్తలతో భూమి విషయమై విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలతో మోసపోయిన సర్పంచ్



కేపీ అగ్రహారంలో సరిగా మొలకెత్తని సర్పంచ్ ఆకుమడి

బుచ్చెయ్యపేట : నాసిరకం వరి విత్తనాలతో పలువురు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కేపీ అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీను తన గ్రామ రైతు సేవా కేంద్రంలో ఆర్‌జీఎల్ 2537 రకం మూడు బస్తాల వరి విత్తనాలను 20 రోజుల కిందట రూ.3వేలకు కొనుగోలు చేశారు. తన పొలంలో దమ్ము చేసి వరి విత్తనాలు వేశారు. విత్తనాలు వేసి 15 రోజులు దాటిన వరి విత్తనాలు సరిగా నాటలేదు. మూడు బస్తాలు వేయగా ఒక బస్తాకి తగ్గ ఆకు మాత్రమే నాటిందని వాపోయారు. నాసిరకం వరి విత్తనాలను ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేశారని వాపోయారు. ప్రభుత్వం సరఫరా చేసిన వరి విత్తనాల బస్తాలను రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ సిబ్బంది మొలక శాతంను పరీక్షించకుండా నేరుగా రైతులకు అమ్మకాలు చేశారన్నారు. ఇప్పటికే వర్షాలు సరిగా లేక వరి ఆకు పోతలు ఆలస్యంగా వేశామని ఇపుడు నాసిరకం వరి విత్తనాల వల్ల వరి ఆకు నాటక తీవ్రంగా నష్టపోయామన్నారు. ఏడాది తిండి గింజలు ఆరంభంలోనే దక్కని పరిస్థితి ఏర్పడిందన్నారు. నాలాగే మా గ్రామంలో రైతుల ఆకుమడులు సరిగా నాటడం లేదని ప్రభుత్వం నాసిరకం విత్తనాలు సరఫరా చేసిన వారిపై చర్యలు తీసుకుని నష్ట పరిహారం అందించాలని కోరారు.

నారు దశలో జాగ్రత్తలు ఇలా..!



నారుమడి

కోటవురట్ల: వరి సాగు చేసే రైతులు విత్తనాలు వేయడం నుంచి నారు సంరక్షణ, నాట్లు, కోతలు వరకు వివిధ దశల్లో జాగ్రత్తలు, అప్రమత్తత తప్పనిసరి. ప్రస్తుతం ఖరీఫ్ సీజను ప్రారంభం కావడంతో అన్నదాతలు సార్వా సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు. వరి సాగును అధిక దిగుబడితో లాభసాటిగా మార్చుకోవాలంటే నారు కీలకపాత్ర పోషిస్తుంది. ఆరోగ్యవంతమైన నారు కోసం సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. నారుమడి తయారు చేయడం, వర్షాభావ పరిస్థితుల నుంచి నారును కాపాడుకోవడం పట్ల శ్రద్ధ తీసుకోవాలి. ఆరోగ్యవంతమైన నారు కోసం వ్యవసాయాధికారులు పలు సలహాలు, సూచనలు చేస్తున్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఖరీఫ్ సీజనులో సుమారు సుమారు 10 వేల హెక్టార్లలో వరి సాగు జరుగుతుంది.

ఎంత నారు అవసరం..

సాగు చేసే విస్తీర్ణాన్ని బట్టి నారుమడిని తయారు చేసుకోవాలి. ఎకరా పొలంలో నాట్లు వేయాలంటే 5 సెంట్ల పరిధిలో విత్తనాలు చల్లుకోవాలి. ఇందుకు ఒక లీటరు నీటిలో ఒక గ్రాము కార్బండిజం కలిపిన ద్రావణంలో 5 కిలోల విత్తనాలను వేసి 24 గంటల పాటు నానబెట్టి, మొలకలు వచ్చాక తయారు చేసిన నారుమడిలో చల్లుకోవాలి. నారు ఆకు పూర్తిగా విచ్చుకునేంత వరకు ఆరుతడులు పెడుతూ ఆ తర్వాత పలుచగా నీరు పెట్టాలి.

యాజమాన్యం ఇలా..

ఎకరా పరిధిలో నాట్లు వేయడానికి నారుమడిలో 6 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 1.5 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ దమ్ములో వేయాలి. విత్తనాలు చల్లే ముందు 2 కిలోల యూరియా, విత్తనాలు వేసిన 10 రోజుల తర్వాత ఒక కిలో యూరియా వేయాలి. దీని వల్ల నారు బలంగా ఏపుగా పెరిగే అవకాశం ఉంటుంది. నారుమడిలో ఇనుపధాతు లోపం ఏర్పడితే లేత లీటరు నీటిలో 20 గ్రాముల అన్నబేధి, 2 గ్రాముల నిమ్మ ఉప్పు కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



విత్తిన 10 రోజులకు ఎకరా నారు మడిలో 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను వేయాలి. 10 రోజులకు లేదా ఒక లీటరు నీటిలో 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ లేదా 2 మి.లీ క్లోరిపైరిఫాస్ కలిపి పిచికారీ చేసి మళ్లీ 17 రోజులకు పిచికారీ చేయాలి. నారు తీయడానికి 7 రోజుల ముందు మడిలో పలుచగా నీరుపెట్టి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ 2జి గుళికలను ఇసుకలో కలిపి చల్లాలి.

– బి.సరోజిని, ఏవో, కోటవురట్ల

స్మార్టు మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం



విద్యార్థులకు వివరిస్తున్న సీఐటీయూ జిల్లా నాయకుడు శ్రీనివాసరావు

కశింకోట: ఇళ్లకు స్మార్టు మీటర్లు అమర్చవద్దని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కశింకోటలో కరపత్రాలను పంపిణీ చేశారు. స్మార్టు మీటర్ల వల్ల కలిగే నష్టాలను జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు విద్యార్థులకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అదానీ గ్రూపునకు లాభాలు దోచి పెట్టడానికి, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ప్రజల నుంచి ఆదాయాలను గుంజుకోవడానికి స్మార్టు మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. దీనివల్ల తక్కువ విద్యుత్ వాడే వారికి భారీ విద్యుత్ చార్జీలతో చుక్కలు చూపుతారన్నారు. 300 యూనిట్లు దాటి వినియోగించే వినియోగదారులకు తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు లేకుండా చేస్తారన్నారు. దీనిదృష్ట్యా స్మార్టు మీటర్లు బిగించకుండా ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు.